

# గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన సామాజిక కథ

**జీవితం బోరుగా ఉన్నదని - పదోసారి అనుకున్నది శారద.**
**పూర్ణ శారద ఆమె పూర్తిపేరు.**

**డిగ్రీ పాసై - పీ.జీ.లో సీటురాక - కాలక్షేపానికి ఏదో కంప్యూటర్ కోర్సు చేస్తోంది. సాయంత్రం పూట ఒక గంట క్లాసుకి వెళ్లడమే తప్ప ఆమెకి రోజంతా పనే లేదు.**

పగలంతా టీ.వీ.లో సినిమాలు చూడటం, పొద్దున పూట పేపరు చదువుకోవడం - ఆ తర్వాత ఏవో వారపత్రికలు, సినిమా పత్రికలు తిరగేయడం ఆమె పని.

తండ్రి ప్రైవేట్ కంపెనీలో మేనేజరు. తల్లి ప్రొఫెసరు - యూనివర్సిటీలో. ఆవిడ తెలుగు సాహిత్యం కానీ, తండ్రి మేనేజ్‌మెంట్ స్కిల్స్ గానీ శారదకి రాలేదు.

పేరు పూర్ణ శారద.

కాని ఆమెకి చదువులో పెద్దగా ఆసక్తి లేదు.

ఉద్యోగంలో కూడా.

ఆమెకి పెళ్లిమీద కూడా పెద్ద ఆసక్తి లేదు.

ఆమెకి దేనిమీదా ఆసక్తి, ఉత్సాహం లేకపోవడమే ఆమె సమస్య.

అలాగని ఆమె డిప్రెషన్ పేషెంట్ ఏమీ కాదు.

కబుర్లు, షికార్లు, షాపింగ్ ఆమెకి సరదాలు.

తమ్ముడు మెడిసిన్ చదువుతూ కర్ణాటకలో ఉంటాడు. ఇంట్లో ఒక్కత్తే. ఫోన్‌లో ఫ్రెండ్స్‌తో ఎంతసేపని కబుర్లు చెబుతుంది?

ఏవో పాటలు వింటూ కాసేపు కాలక్షేపం చేస్తుంది.

ఆమెకి సంగీతంలోనూ పెద్ద ఆసక్తి ఏమీ లేదు.

ప్రవేశం అంతకన్నా లేదు.

శాస్త్రీయ సంగీతం ఆమెకి బోరు.

ఏవో ఇటీవలి సినిమాల్లో తనకి నచ్చిన పాటలు వింటూ ఉంటుంది.

తండ్రి ఎం.బి.ఏ. చదివి పెద్ద బహుళజాతి సంస్థలో ప్రాంతీయ అధికారి. ఆయన పనిలో ఆయన ఉంటాడు.

తల్లి తెలుగు సాహిత్యంలో సమకాలీనుల్లో ప్రముఖురాలు. ఆవిడపేరు వెంకటలక్ష్మి. ప్రతీ సాయంత్రం దాదాపుగా ఆవిడకి ఏది సభో, సమావేశమో ఉంటూనే ఉంటుంది. పుస్తక విమర్శ, సమీక్ష, ఉపన్యాసాలలో ఆవిడ ప్రముఖురాలు. అయినా ఈ పిల్లని ఆవిడ సాహితీ



# అంకురం

## - ముదిగొండ శివ కౌముది దేవి

సభలు ఆకర్షించలేకపోయాయి. ఇంటినిండా ఉన్న తెలుగు సాహిత్యం కూడా.

ఆమె స్నేహితులంతా పీ.జీ.లోనో, పోటీ పరీక్షలకి శిక్షణలోనో, టీచరుద్యోగాల్లోనో చేరారు. కొందరు పెళ్లి చేసుకున్నారు.

శారదకి సంబంధం సిద్ధంగానే ఉన్నది.

మేనరికం వాళ్ల బావ అమెరికాలో ఉన్నాడు ఆంగ్ల

సాహిత్యంలో డాక్టరేట్ చేస్తున్నాడు. ఉద్యోగం కూడా వచ్చినట్లే.

శారదకి ఆంగ్ల సాహిత్యంలోనూ ఆసక్తి లేదు.

"ఇంట్లో తెలుగు సాహిత్యం బోరుగా ఉంది, భరించలేకుండా ఉన్నాదనుకుంటే - ఇంక పెళ్లయ్యాక ఆంగ్ల సాహిత్యం భరించాలి కాబోలని" తిట్టుకుంటూ ఉంటుంది.

మనిషికి జీవితంలో ఏం కావాలో తెలియక పోవడమే పూర్ణ శారద సమస్య.

నల్లకుంటలో వాళ్ల ఇల్లు - వాళ్ల తాతగారు కట్టించారు. పై వాటాలో మరో కుటుంబం ఉంటుంది. కాని భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్థులు. వాళ్లకి పిల్లలు కూడా లేరు. ఎప్పుడైనా పలకరిస్తారు. వాళ్లింటి దగ్గర్లోనే



రామాలయం.

అక్కడ తరచూ పాటకచేరీలు అవుతున్నాయి - ఈ మధ్య.

అయినా శారద వెళ్లదు. ఆమెకీ భక్తి తక్కువే.

ఆమెకింకా జీవితంలో దేవుడితో అవసరం కలగలేదు.

ఇవాళ శుక్రవారం.

సాయంత్రం కావస్తోంది.

శ్రావణమాసం కావడంతో వీధుల్లో ముత్తైదువులు పేరంటాలకి వెళుతూ కనిపిస్తున్నారు.

మధ్యాహ్నం వర్షం పడటంతో రోడ్లు చిత్తడిగా ఉన్నాయి. శారదకి ఆకలి వేస్తోంది.

వంటిల్లంతా వెతికినా తినటానికి ఏమీ దొరకలేదు.

ఏదైనా తినటానికి తెచ్చుకుందామని లూనా బయటకి తీసింది - ఇల్లు తాళం వేసి. తెల్ల చుడీదార్ వేసుకున్నానే - బురద పడుతుందేమో - అని భయపడుతూనే బయల్దేరింది.

శంకర్ మఠ్ దగ్గర్లో ఉన్న ఒక బేకరీకి వెళ్లింది - పిజ్జా కొనుక్కుందామని. కాని దొరకలేదు. అప్పుడింక బండిమీద రోడ్డు క్రాస్ చేసి శివం రోడ్డులో ఉన్న బేకరీకి వెళ్లింది. బాగ్ అంబర్‌పేట్ వెళ్లే రోడ్డు ప్రక్కనే ఉన్న ఆ బేకరీలో పిజ్జా దొరకలేదు కాని బర్గర్ దొరికింది. ఆ బేకరీ ముందు ఒక రంగులరాట్నం ఉన్నది. శారద బర్గర్ తిని, పళ్లరసం తాగుతూ ఆ రంగుల రాట్నంలో కూర్చుంది.

అప్పుడామె దృష్టిని రోడ్డు ప్రక్కన ఉన్న ఒక వృద్ధురాలు ఆకర్షించింది.

ఫుట్‌పాత్ మీద వేప చెట్టు క్రింద బొగ్గుల కుంపటి మీద మొక్కజొన్నపొత్తులు కాల్చి అమ్ముకుంటోంది.

వర్షంపడి చల్లగా ఉండటంతో బేరాలు బాగానే సాగుతున్నాయి.

ఆవిడ ప్రక్కనే ఒక గోధుమరంగు కుక్కపిల్ల పడుకుని ఉంది. ముసలావిడ కుక్క ముందు ఒక బ్రెడ్ ముక్క పడేసింది. కుక్కపిల్ల బ్రెడ్ తింటోంది.

ఆవిడకి ఎనభై ఏళ్లకిపైగా వయస్సుంటుంది.

జుట్టంతా తెల్లబడిపోయింది - ముగ్గుబుట్టలాగా.

చిన్న ఇనపగొట్టంతో నిప్పులమీద బూడిదని ఊదుతూ - నిప్పులని రాజేస్తోంది. స్కూళ్లనుండి వస్తున్న పిల్లలు, పెద్దలూ కూడా వేడివేడిగా సువాసనలీనుతున్న మొక్కజొన్న పొత్తులు కొనుక్కుపోతున్నారు.

ఏ విషయంలోనూ ఆసక్తిలేని పూర్ణ శారదకి ఆ ముసలమ్మ అత్యంత ఆసక్తికరంగా అనిపించింది - ఆ క్షణంలో.

ఎనభై సంవత్సరాల వయస్సులో మొక్కజొన్న పొత్తులమ్ముతూ ఎందుకు డబ్బు సంపాదన ఆవిడకి? పళ్లరసం తాగడం పూర్తి చేసిన పూర్ణ శారదకి మొక్కజొన్నపొత్తు తినాలనిపించింది. రోడ్డు దాటి ముసలమ్మ దగ్గరకి వచ్చింది.


"ఎంతవ్వా? ఈ మొక్కజొన్న" - అనడిగింది.

"రెండ్రూపాయలకి ఒకటి" - చెప్పింది ముసలావిడ - కాలుతున్న మొక్కజొన్నలని అటూ, ఇటూ కదిలిస్తూ, ఆవిడ దృష్టి నిశ్చలంగా పనిమీదే ఉన్నది. తీక్షణంగా కణకణ మండే నిప్పుల్లోకి చూస్తోంది.

"మూడివ్వు" - అంటూ శారద పర్స్‌లోంచి ఆర్రూపాయలు తీసిచ్చింది.

"కూర్చో అమ్మా" అంటూ ముసలావిడ శారదకి ప్రక్కన ఉన్న రాయి చూపించింది.

శారద రాయి మీద కూర్చుంది. ఇంతలో



రివ్వున చలిగాలి వీచింది. చెట్టుకొమ్మలు ఊగి శారద తలమీద టపటపా నీటి చినుకులు రాలాయి.

ముసలావిడని "నీ పేరేమిటవ్వా" - అనడిగింది శారద.

"లచ్చుమ్మ" - చెప్పిందావిడ.

"ఎక్కడుంటావు? నీకెవరూ లేరా?" శారద మళ్లీ అడిగింది.

"ఆ కొండమీద కాలనీ కాడుంటా. నాకొక్క కొడుకు. నన్ను ఇంట్లకెల్లి ఎల్లగొట్టిండు. ఒక్కదాన్నే ఉంటా బిడ్డా, ఇగో ఈ రాముడు నా తోడు" అంటూ కుక్క పిల్లని చూపించింది.

శారదకి ఆశ్చర్యం వేసింది.

"ఏం? ఎందుకు వెళ్లగొట్టాడు నీ కొడుకు?" అన్నది -

"ఇంత ముసలావిడని వెళ్లగొట్టే వాళ్లుంటారా" - అనుకుంది మనసులో.

"వాడు పెండ్లానికి అన్యాయం చేసి ఇంకోతెని తెచ్చుకున్నాడు. నౌకరి చేసే కాడ పైసలు వసూలు చేసి దాచుకున్నడు. జాగా కొన్నడు. వాని యజమాని వచ్చి అడిగితే వాడు జాగా కొన్నడని నేను జెప్పినా. నిజం చెప్పినందుకు కోపం వచ్చింది నా కొడుక్కి. నా తిండి తింటూ నాకు ఎదురు జెప్తవా అని నన్ను ఇంట్లకెల్లి ఎల్లగొట్టిండు. ఏడాదైంది. ఇక్కడ కంకులమ్ముకుంటున్నా. ఆ కొండమీద నర్సింహసామి గుడి దగ్గర మల్లెపూలమ్ముకుంటా. అప్పుడప్పుడు ఇక్కడ కంకులమ్ముకుంటా." అన్నది లచ్చుమ్మ కాలిన మొక్కజొన్న కంకి తీసి శారదకిస్తూ - "ఉప్పు రాయనా" అన్నది.

"వద్దు" అన్నది శారద మొక్కజొన్నపొత్తు వలుచుకుంటూ.

"మీ ఆయన లేడా?" అన్నది శారద మళ్లీ.

"లేడమ్మా! నా పోరగాడు చిన్నగున్నప్పుడే టి.బి. వచ్చి చచ్చిపోయిండు. అంతప్పటినుంచి కష్టంచేసి వాణ్ణి పెద్ద జేస్తే - ఇప్పుడు నన్నే ఎల్లగొట్టిండు" అన్నది లచ్చుమ్మ నిర్వికారంగా.

ఆమె మొహం చూస్తే శారదకి మరీ ఆశ్చర్యం వేసింది. కొడుకుమీద ఆమెకి ఏమీ కోపం లేదని శారదకి అనిపించింది. అదే అడిగింది.

"ఎందుకమ్మా కోపం? నేను నిజం చెప్పాలనుకున్న. చెప్పినా. పెద్ద పెండ్లాంకు అన్యాయం జేస్తవేందిరా అని మందలించినా. అది తప్పైపోయింది. వాడు జేసేది వాడు జేస్తున్నడు. నన్ను ఇంట్లకెల్లి పొమ్మన్నాక - ఇంక నేనెట్లుంట ఆడ - మెడబెట్టి గెంటినాక - వాని కర్మ ఎట్లుంటే అట్లైతది -" అన్నది ముసలావిడ ఇంకో మొక్కజొన్నపొత్తు కాలుస్తూ.

శారద ఏమీ మాట్లాడలేకపోయింది.

నిజానికి అక్కడ మాట్లాడటానికి ఏమీ లేదు.

ఏమీ చదువుకోని ఆ నిరక్షరాస్యురాలు - పెద్దగా లోకజ్ఞానం - లౌక్యంలేని ముసలావిడ - తన జీవితంలో ఎదుర్కొన్న పెద్ద సమస్యని - వృద్ధాప్యంలో తనను తాను పోషించుకోవాల్సిన పెద్ద బాధ్యత మీద పడినా, మొక్కవోని ధైర్యంతో పరిష్కరించుకున్న విధానం చెక్కు చెదరని ధీమాతో, జీవితగమనంలో ఎనభై ఏళ్ల వయస్సులో ఎదురీతకి సిద్ధపడిన ఆమె సాహసం - చాలా సులువుగా - అతి మామూలుగా బ్రతికేస్తున్న ఆమె నైర్మల్యం - అవి శారదని కదిలించాయి.

కాని వ్యాఖ్యానించడానికి ఏముంది?

జీవితం వ్యాఖ్యానాలకి అతీతమైంది.

తన దారిన తాను ప్రవాహగతిలో సాగిపోతుంది.

శారదకి ఈ సంభాషణవల్ల తన మనస్తత్వంలో ఏదో మార్పు కలిగినట్లు అనిపించింది.

ఈ పది నిముషాల్లోనే తను పరిపక్వత పొందినట్లు, తనలో ఏదో పరివర్తన వచ్చినట్లు అనిపించింది.

ఇంత ముసలి వయస్సులో - కొడుకు ఇంట్లోంచి వెళ్లగొట్టగల సమర్థుడని ఎరిగి ఉండే ఆవిడ అతడికి వ్యతిరేకంగా నిజం చెప్పింది. నిజం చెప్పాలనుకునే చెప్పింది. కోడలికి అన్యాయం చేయొద్దని మందలించింది. నీతిగా ప్రవర్తించమని సలహా చెప్పింది.

ఫలితం అనుభవిస్తోంది - నిశ్చింతగా, నిర్వికారంగా, నిర్భయంగా, ఇదంతా సరే!

ఇది నాణానికి ఒక వైపు - ఇంక రెండోవైపు.

ఆవిడకి ఉన్న జీవితోత్సాహం - జీవితాన్ని ఆమె అనుభవించే విధానం - జీవిస్తున్న పద్ధతి - అంత ముసలితనంలో ఆవిడపడుతున్న కష్టం - శారీరకం - మానసికమూ కూడా.

అయినా ఆ కష్టం గురించి ఆవిడకి చింత లేకపోవడం -

శారదకి క్రొత్తగా ఏదో విషయం - ఒక సత్యం - బోధ పడినట్లనిపించింది.

మూడు మొక్కజొన్నపొత్తులూ కాల్చి ఇచ్చి ముసలావిడ డబ్బు తీసుకుంది. లెక్కబెట్టుకుని

### కలలు కంటున్న కాట్రీనా

తనెంత మంది సినీతారలతో ప్రేమాయణాలు జరిపాడో సల్మాన్ ఖాన్‌కే గుర్తుండి వుండకపోవచ్చు. కానీ ఇప్పటికైనా స్థిరపడుతున్నందుకు బాలీవుడ్ జనం సంతోషిస్తున్నారు. 'బూమ్' చిత్రంతో జనం కళ్లల్లో పడిన కాట్రీన కూడా సల్మాన్ కుటుంబంలోకి వెళ్లగలుగుతున్నందుకు సంతోషంగానే కనిపిస్తున్నది. తరచూ ముంబయి రెస్టారెంట్లలో అందరికీ కనిపిస్తున్నది సల్మాన్-కాట్రీనల జంట. అసలు కొంత కాలం వేరే ఫ్లాట్‌లో వుంచిన కాట్రీనను ఇప్పుడు సరాసరి తన ఇంటికే తీసుకెళ్లిపోయి ఆశ్రయమిచ్చాట్ట సల్లూ. అభిమానులందరూ వీరి పెళ్లి కోసం ఎదురు చూస్తున్నారు.

చేతిసంచిలో దాచుకుంది. గోనె సంచీలో తెచ్చిన మొక్కజొన్నపొత్తులయిపోయాయి కాబోలు మడిచి పెట్టింది.

"ఇంటికేనా?" అడిగింది శారద మొక్కజొన్నపొత్తులు హ్యాండ్ బేగ్‌లో వేసుకుంటూ.

"అవునమ్మా" అన్నది ముసలావిడ.

"నేను దింపుతాను రా." అన్నది లూనా తీస్తూ.

"వద్దులేమ్మా. నడిచివెళ్తా" అన్నది లచ్చుమ్మ.

"ఫరవాలేదులే రా." అన్నది శారద లచ్చుమ్మని లూనా వెనుక కూర్చోబెట్టుకుంటూ.

శివం టెంపుల్ దాటాక కుడి ప్రక్కన దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ. తోవల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం. ఆ వెనగ్గా ఒక ఖాళీ ప్లాట్‌లో వేసిన గుడిసెలు.

అక్కడ దిగిపోయింది లచ్చువ్మ. తట్టుపంచులు, కర్రలతో వేసిన పాక. గుడిసె కూడా కాదు.

రాముడు లూనా వెనకే పరిగెత్తుకుంటూ వచ్చింది. గుడిసె ముందు పడుకుంది.

"పొద్దున్నంతా గుడి ముంగట ఊడుస్తామ్మా. సాయంత్రం మల్లెపూలమ్ముకుంటా. ఇట్లా కాలమొచ్చినప్పుడు కంకులు, పండ్లు అమ్ముకుంటా" అన్నది లచ్చుమ్మ.

ఆ చిన్నపాకలో నిశ్చింతగా, ధీమాగా, ఒంటరిగా తన వృద్ధాప్యాన్ని శరీర కష్టంతో గడిపేస్తున్న ఆ ముసలావిడ - ఆవిడకి తోడుగా ఆ పెంపుడు కుక్క - వారి ఒంటరి జీవితాలు. రెక్కాడితే గానీ డొక్కాడని జీవితాలు.

శారద వెళ్లొస్తానన్నది.

ముసలమ్మ లోపలికెళ్లి ఒక మల్లెపూలదండ తెచ్చి ఇచ్చింది.

శారద అడిగింది. "అవ్వా! నీకెప్పుడూ జీవితం విసుగనిపించదా?" - అని.

ముసలమ్మ ఆశ్చర్యంగా చూసింది.

"విసుగా? విసుగెందుకమ్మా? ఎన్నో కష్టాలు పడితే - ఎంతో పున్నెం జేస్తే మనిషి జన్మ దొరుకుతది - మంచిగ బతకాలె. కాని జీవితం విసుగనిపిస్తాది? - దేవుడు ఆయుష్షు ఇచ్చినన్నాళ్లు బతకాలె - సంపాదించాలె - తినాలె - ఒగలకు పెట్టాలె - అండ్లనే ఇంత దాసిపెట్టాలె - రేపు మనం పోయినంక మన కర్చులకు - నీ అసోంటి పిల్లలు మంచిగ పనిచేయాలె - బాగా చదువుకోవాలె - నౌకరి చేయాలె - ఉషారుగుండాలె - ఇసుగెందుకు?" అన్నది ఆశ్చర్యంగా - బుద్ధి చెబుతున్నట్లుగానూ -

"నాకెప్పుడూ బతుకు విసుగు పుడుతుంది." అన్నది పూర్ణ శారద. తన మానసిక సమస్యని ఒక సైకియాట్రిస్టుతో చెప్పుకున్నట్లు.

"అట్లనగూడదు బిడ్డా. ఉషారుగుండాలె. బాగా సదవాలె. పనిజేయాలె, నలుగురికి సాయం జేయాలె. నౌకరి చేసి కమాయించాలె." అన్నది లచ్చుమ్మ కుక్కకి అన్నం వేస్తూ.

"అవును. నిన్ను చూసాక అర్థమైంది. కష్టం విలువ, శ్రమ విలువ. నీతి విలువ. డబ్బు విలువ. సాటి ప్రాణిమీద జాలి. బతుకుమీద ఆశ. బతకాలి - కాని నీతిగా, కష్టపడి ఎంత వయస్సులో అయినా బతకాలి. ఇంకోళ్లని బతికించాలనే బాధ్యత. దారేపోయే బాధ్యత మీద వేసుకోవడం - అందుకు కావాల్సిన


# కడుపులో బాధా?

జీర్ణకోశం, కాలేయం, ప్యాంక్రియాస్, పిత్తాశయం (గాల్ బ్లాడర్), మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధి కావచ్చు!

- తీవ్రమైన కడుపు నొప్పి
- రక్తంతో కూడిన వాంతులు
- నీటి విరోచనాలు
- కడుపు ఉబ్బరం (నీరుచేరడం)
- వాంతులు
- మలంలో రక్తం
- కడుపులో మంట / ఆకలిలేకపోవుట

ఉదరం
కోలోరెక్టల్
మూత్రపిండాలు
కాలేయం
ప్యాంక్రియాస్



అకస్మికంగా వచ్చే కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. గుండెపోటు, అకస్మాత్తుగా వచ్చే ఇతర జబ్బులకన్నా ఇవి ఎక్కువ అవుతున్నాయి. ఉదరకోశ వ్యాధులు ఏ వేళలోనైనా, ఎవరికైనా అకస్మాత్తుగా వచ్చే ప్రమాదముంది. అప్పుడు మీకు కావాల్సింది సురక్షితమైన, ఖచ్చితమైన తక్షణ చికిత్స. అలాంటి అత్యవసరవేళల్లో గ్లోబల్ హాస్పిటల్స్ మీకు అండగా నిలుస్తుంది. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన సీనియర్ డాక్టర్ల సహకారంతో 24 గంటలూ వైద్య సౌకర్యాలు అందిస్తుంది.

EMERGENCY 24 Hrs SERVICE

ప్రత్యేకతలు
- 24 గంటలు అందుబాటులో సీనియర్ స్పెషలిస్టు డాక్టర్లు, సర్జన్లు.
- బ్లడ్ బ్యాంకు, అధునాతన ల్యాబ్, ఇమేజింగ్ సౌకర్యాలు.
- ప్రపంచస్థాయి సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్, ఇన్‌టెన్సివ్ కేర్.
- క్రిటికల్ కేర్, గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ స్పెషలిస్టుల సముప్తికృషి.

EXCELLENCE THROUGH TEAM WORK

అందుకే .... ఉదర సంబంధ వ్యాధుల చికిత్సలో గ్లోబల్ హాస్పిటల్స్ ప్రత్యేక స్థానం పొందింది.
సంప్రదించండి ఫోన్ : 23234567, 94404 34567

అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకోసం ప్రత్యేకంగా దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన గ్లోబల్ హాస్పిటల్స్ ఇప్పటికే కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతంగా చేసింది.

గుర్తింపు :
ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
ఎ.పి. ట్రాన్స్‌కో, ఎఫ్.సి.ఐ, ఎ.పి.జెన్ కో,
సి.సి.డి.పి.ఎల్, బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి

GLOBAL HOSPITALS
Medical excellence through Teamwork

సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే, ఎన్.టి.పి.సి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజి, లివర్ డిసీజస్, రీనల్ డిసీజస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కోలోరెక్టల్ సర్జరీ, అంకాలజీ
జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్
లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) వెబ్ సైట్: www.theglobalhospital.com

TIME & SPACE

ధైర్యం. ఇవన్నీ నీకు - మీకు - మీ తరంలో అందరికీ ఉన్నాయి. కాని మాకు లేవు. మా తరం వేరు. మా పెంపకంలో ఎక్కడో లోపం జరిగింది అవ్వా. మాకు స్వార్థం తప్ప ఇంకే విలువా లేదు. పెద్దగా నీతి గురించి పట్టింపులేదు. డబ్బు సంపాదించాలనే ధ్యాసే తప్ప మరే బాధ్యతా లేదు. ఆ డబ్బైనా మా కోసమే. కుక్కపిల్లని పెంచే బాధ్యత కూడా మేం తీసుకోలేం. మాకు అదో పెద్ద భారంగా, అనవసరంగా అనిపిస్తుంది. జీవితం తరచూ బోర్ కొడుతుంది. ఎప్పుడూ ఏదో ఒక కాలక్షేపం - కావాలి - సినిమాలో, సంగీతమో, ఒకరినొకరు ఏడిపించుకోవడమో. ఒకడి కష్టం ఒకరికి పట్టదు. మేం వేస్ట్‌గా బ్రతుకుతున్నామని మాకే అనిపిస్తుంది" అన్నది శారద ఆవేశంగా.

లచ్చమ్మకి అర్థమైంది - భాష కాకపోయినా భావం - సారాంశం, శారదని జాలిగా చూసింది.

అర్జున విషాదయోగంలో అర్జునిడికి జ్ఞానబోధ చేసిన కృష్ణుడిలా చెప్పింది - "బిడ్డా, ఎవని సంగతి వాడు చూస్కోనీకి పశువులైతే చాలు. ఒకని సంగతి ఒకరు చూస్కోనీకి మనుషులు కావాలె. మనిషి పుటక పుట్టినందుకు మనిషిలాగ బతకాలె. పశువులాగా కాదు. నీ సంగతి నువ్వు చూస్కోవాలె. అమ్మ, అయ్యను చూస్కోవాలె. దోస్తులను గూడా చూస్కోవాలె -" అన్నది.

"నేను వెళ్లొస్తా అవ్వా" అని శారద సెలవు తీసుకుంది.

మోపెడ్‌పై ఇంటికి వెళ్తూ అనుకుంది - తనవంక జీవితంలో బోర్ కొట్టడం అనేది మళ్లీ జరగకూడదని.

ఆకాశంలో చీకట్లు ముసురుకుంటున్నాయి.

వీధి దీపాలు వెలిగాయి.

హడావిడిగా జనాలు.

ఎవరిపనుల్లో వారు. తమకోసం, తమ వారసుల కోసం పని చేస్తూ - కష్టపడుతూ - సంపాదిస్తూ - కాలం గడుపుతూ.

ఇంతమంది ఏదో ఒక మోటివ్‌తో పనిచేస్తేనే కదా! ప్రపంచం కొంత గమనశీలతతో ముందుకు నడుస్తోంది.

వీళ్లందరికీ జీవితం బోరు కొడితే?

శారదకి విషయం అర్థమైంది.

ప్రపంచాన్ని చలనస్థితిలో ఉంచడానికే దేవుడు ఈ పనులూ, కోరికలూ, భావోద్వేగాలూ అన్నీ ఏర్పరచాడు. అందరికీ చేతినిండా పని కల్పించడానికి. ఈ లోకంలో ప్రతి ఒక్కరివల్లా అందరికీ ఏదో ఒక ప్రయోజనం కలుగుతోంది - వాళ్లు చేసే పనివల్ల.

తనే ఏ పనీ చేయడంలేదని శారద గ్రహించింది. ఇల్లు వచ్చేసింది.

"రేపే ఏదైనా స్కూల్లో టీచర్ ఉద్యోగానికి అప్లై చేయాలి." అనుకుంది శారద. "పై ఏడాది పీ.జి. ఎంట్రన్స్‌కి ప్రిపేర్ కావాలి - అమ్మకి ఇంటిపనిలో సాయం చేయాలి" - అనుకుంది.

అయినా శారదకి ఇంకా ఏదైనా చేయాలనిపించింది.


లచ్చమ్మలాంటి వృద్ధులకోసం.

కని పెంచిన పిల్లలు వదిలేసిన వృద్ధులకోసం.

ఆ మర్నాడే తమ కాలేజ్ ప్రిన్సిపాల్ నడిపే సామాజిక సంస్థలో చేరాలని నిర్ణయించుకుంది. ఇంట్లోకి రాగానే టి.వి. చూడకుండా రాత్రి వంటకి కూర తరగడానికి ప్రయత్నం ప్రారంభించింది శారద - ఏనాడూ ఇంట్లో పని చేయని శారద.

పెద్ద వృక్షం కూడా చిన్న విత్తనంతోటే ప్రారంభమవుతుంది.

అవును కదా!



### మరో క్రికెట్ వీరుడి ప్రేమకథ

సినిమా తారామణులూ, క్రికెట్ క్రీడాకారులూ ప్రేమాయణం జరపటం చాలా కాలంగా నడుస్తూనేవుంది. తాజాగా వినిపిస్తున్న పేర్లు 'మొహబ్బతే' హీరోయిన్ కిమ్‌శర్మ, యువరాజ్‌సింగ్‌లవి. తమ మొబైల్ ఫోన్స్ ద్వారా ఎస్సెమ్మెస్‌లు పంపించుకోవటంలో ఈ జంట దిట్టగా పేరు సంపాదిస్తున్నదట. ఈ విషయంలో కిమ్, మరో అభినేత్రి మహిమాచౌధరిని అనుకరిస్తున్నదంటున్నారు. అయినా ఈ ప్రేమైనా పెళ్లి వరకూ పోతుందో, పోదో!

